
# తిరిగివచ్చిన బాణం

వాణిశ్రీ



రజిత పెళ్లికొడుకు తరఫు వారందరికీ నచ్చింది. మనోహర్ గూడా రజిత ఇంట్లోవారందరికీ నచ్చాడు. కట్న కానుకలు, పెట్టుపోతలు అన్నీ మాట్లాడుకున్నారు.

రజితకు మాత్రం అసంతృప్తిగా ఉంది. ఎందుకంటే ఆమె చేస్తున్న జాబ్ మానేయాలని పెళ్లికొడుకు పట్టుబట్టాడు. మనోహర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. పెద్ద కంపెనీలో ఉద్యోగం. నెలకు యాభైవేలు జీతం. కూకట్‌పల్లిలో ఇక ఇండిపెండెంట్ హౌస్, మాదాపూర్‌లో ట్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ ఉన్నాయి. రజిత టీచర్ ఉద్యోగం చేస్తోంది. ఆ స్కూల్ వాళ్లు ఇచ్చేది ముష్టి ఐదువేల జీతం. శుభ్రంగా ఇల్లు చూసుకోక పగలంతా ఆ అరవ చాకిరీ ఎందుకు?

రజిత తల్లిదండ్రులు, అన్నయ్య శశికాంత్ కూడా మనోహర్‌నే బలపరిచారు.

రజిత తల ఊపక తప్పలేదు.

తనకి ఎంతో ఇష్టమైన టీచర్ ఉద్యోగం వదులుకోవడం ఎంతో బాధగా ఉంది. కానీ జీవితంలో ఇష్టం లేకపోయినా కొన్ని పనులు చేయకతప్పదనే కఠోర సత్యం ఆమెకు అనుభవంలోకి వచ్చింది.

ఆడది ఉద్యోగం చేయాల్సిరావడం కేవలం డబ్బు కోసమేనా? అభిరుచి కోసం, జీవితంలో సంతృప్తి కోసం చేస్తానంటే ఎవరూ ఒప్పుకోరా? అని కలవరపడింది రజిత.

ఫలానా రోజున ఎంగేజ్‌మెంట్ అని నిర్ణయించేసుకున్నారు పెద్దవాళ్లు.

ఇంట్లో పెళ్లి సందడి మొదలైంది.

బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడడంతో 'మే' నెల ఎండల నుంచి ఉపశమనం కలిగిస్తూ చిరుజల్లులు కురుస్తున్నాయి. చల్లటిగాలి వీస్తుంటే హాయిగా ఉంది. రజిత వరండాలో కూర్చుని వర్షాన్ని ఎంజాయ్ చేస్తోంది.

ఇంటి ముందు కారు ఆగింది.

"హాయ్ వదినా!" అంటూ వచ్చింది లావణ్య.

లావణ్య మనోహర్ చెల్లెలు.

"హాయ్!"అంటూ ఆమెను ఆహ్వానించింది రజిత.

లావణ్య ఇంట్లోకి వెళ్లి రజిత తల్లిదండ్రులను పలకరించి వచ్చి కూర్చుంది.

"వదినా! మనం ఒకసారి మమత నర్సింగ్‌హోమ్‌కి వెళ్లాలి" అన్నది లావణ్య.

"ఎందుకు?" అన్నది రజిత

"అక్కడ మా మేనత్త సీతాదేవి డాక్టర్"

"అలాగా! నీకేమైనా ప్రాబ్లమా?" అని ప్రశ్నించింది రజిత.

"ఏం లేదు" అన్నది లావణ్య

"మరి"

"ఒకసారి నిన్ను టెస్ట్ చేయించాలి"

"నన్నా? ఎందుకు?" ఆశ్చర్యపోతూ అడిగింది రజిత

"బ్లడ్ టెస్ట్ వగైరా!"అన్నది లావణ్య

"ఓ బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడానికా? ఈ మధ్యనే మా హైస్కూల్‌లో మెడికల్ క్యాంప్ పెట్టారు. అప్పుడు చూపించాను." అని తన బ్లడ్ గ్రూప్ చెప్పింది రజిత.

లావణ్య కళ్లు మూసుకొని ఏదో ఆలోచనలో పడింది. ఏం మాట్లాడలేదు. రజితకి అయోమయంగా ఉంది.

"అమ్మాయ్! లావణ్యను లంచ్‌కి ఉండమను" లోపల నుంచి రజిత తల్లి కేక పెట్టింది.

"అమ్మ! లంచ్‌కి ఉండమంటోంది" చెప్పిందిరజిత.

లావణ్య మూడీగా ఉంది.

"నీకీ విషయం ఎట్లా చెప్పాలో అర్థం కావడం లేదు వదినా!" తల వంచుకొని అన్నది లావణ్య.

"ఫర్వాలేదు చెప్పు' అన్నది రజిత.

లావణ్య నెమ్మదిగా అసలు విషయం చెప్పింది.

షాక్ తగిలినట్లు అదిరిపడింది రజిత. ఆమె ముఖం ఎర్రబడిపోయింది. కోపంతో పెదవులు అదిరిపడుతున్నాయి. సన్నటి కన్నీటి పొరలోంచి లావణ్య ముఖం అస్పష్టంగా కనిపిస్తోంది.

"నిజానికి ఇటువంటివి నాకూ ఇష్టం లేదు. ఏదో వాడి సంతృప్తి కోసం. అందులోనూ డాక్టర్ పరాయిది కూడా కాదు" చెప్పిందిలావణ్య.

"ప్లీజ్ లావణ్యా! ఇప్పుడు కాదు. నేను తర్వాత ఫోన్ చేస్తాను" తమాయించుకుని అన్నది రజిత.

"సరే ఐతే నేను వెళ్లొస్తాను"అని లేచింది లావణ్య

తల ఊపింది రజిత



"రోజులు మారుతున్నాయని గ్రహించండి. మగపెళ్లివాళ్లం కదా... అడ్డమైన కోరికలు కోరితే సహించే రోజులు పోయాయని గ్రహించండి. హైటెక్ సిటీలో పని చేస్తున్నారు కానీ బుద్ధులు మాత్రం లోటెక్‌లో ఉన్నాయి"

"ఏమీ అనుకోకు వదినా! అన్నయ్యది అదో మాదిరి. కొంచెం చాదస్తం అనుకో!" అన్నది లావణ్య

రజిత ఏం మాట్లాడలేదు. ఆమె ముఖం కందగడ్డలా మారిపోయి ఉండడం చూసి లావణ్య కూడా బాధపడింది. ఇందులో తన ప్రమేయం ఏం ఉంది? మనోహర్ ఒకరి మాట వినే రకం కాదు.వాడి కెంత తోస్తే అంతే!

లావణ్య కారెక్కి బయల్దేరింది.

అప్పుడే శశికాంత్ బైక్ మీద ఇంటికొచ్చాడు.

"ఏంటీ పెళ్లికొడుకు చెల్లెలు ఇలా వచ్చింది? ఏదైనా సరికొత్త డిమాండ్ మోసుకొచ్చిందా?" నవ్వుతూ అడిగాడు శశికాంత్.

"అన్నయ్యా!...." అంటూ దుఃఖం ఆపుకోవడానికి ప్రయత్నిస్తోంది.

కానీ ఆమె వల్ల కాలేదు.

"రజితా! ఏంటి చిన్నపిల్లలా! ఎందుకు ఏడుస్తున్నావు?" అనునయంగా అడిగాడు శశికాంత్

లావణ్య తనకు చెప్పిన విషయం చెప్పింది.

అది విని శశికాంత్‌కి కూడా కోపం వచ్చింది.

"నాకీ పెళ్లి వద్దు అన్నయ్యా!" అన్నది రజిత కళ్లు తుడుచుకుంటూ..

"నేను మనోహర్‌తో మాట్లాడతాగా!" అనునయించాడు శశికాంత్.

***

హైటెక్ సిటీలో పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు మనోహర్.

శశికాంత్ వెళ్లే సరికి సీట్లో లేడు. మనోహర్ క్యాంటీన్‌లో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లాడు. క్యాంటీన్‌లో తన ఫ్రెండ్స్‌తో కూర్చుని కాఫీ తాగుతున్నాడు మనోహర్.

శశికాంత్‌ని చూసి "రండి... రండి...." అని ఆహ్వానించి కాఫీ తెప్పించాడు. తన ఫ్రెండ్స్‌కి పరిచయం చేశాడు.

"మీరొక సారి సుస్మితా నర్సింగ్ హోమ్‌కి రావాలి. ఈరోజు వీలవుతుందా?" అడిగాడు శశికాంత్

మనోహర్ తెల్లబోయాడు. అతని ఫ్రెండ్స్ అదోలా చూశారు.

"నేనా? ఎందుకు?" తడబడ్డాడు మనోహర్

"అక్కడ మా మేనమామ డాక్టర్ మిమ్మల్నొకసారి టెస్ట్ చేయించాలి" అన్నాడు శశికాంత్.

"నన్నా! నాకేం ప్రాబ్లమ్ లేదే?" అన్నాడు మనోహర్ అసహనంగా...

"ప్రాబ్లమ్ లేదని చెప్పాల్సింది మీరు కాదుగా! డాక్టర్ సర్టిఫై చెయ్యాలి" సూటిగా అన్నాడు శశికాంత్.

"డాక్టర్ సర్టిఫికెటా? నాకెందుకు? ఐ యామ్ ఆల్‌రైట్" మనోహర్ కోపాన్ని అణుచుకుంటూ చెప్పాడు.

"డాక్టర్ సర్టిఫికెట్ మీకు కాదు.'మాకు కావాలి." అన్నాడు శశికాంత్.

మనోహర్‌ఫ్రెండ్స్‌కి విషయం ఏమిటో అర్థం కావడం లేదు ఆశ్చర్యంగా వింటున్నారు.

"సారీ! మిస్టర్ శశికాంత్ విషయం ఏమిటి? మనోహర్‌ని డాక్టర్ దగ్గరికి ఎందుకు రమ్మంటున్నారు? మనోహర్ ఫ్రెండ్ అడిగాడు.

"మీరు ఏమీ అనుకోకండి. ఈరోజుల్లో ఎవర్నీ నమ్మలేం కదా? నా కంటే మీకే ఎక్కువగా మనోహర్ గురించి తెలిసి ఉండాలి. పెళ్లికి ముందు అమ్మాయిల్తో ఎఫైర్స్ మామూలే అని మీరు అనొచ్చు. కానీ మా భయం మాది" అన్నాడు శశికాంత్.

"ఇంతకీ మీరు అనేదేమిటీ?"

"మనోహర్‌కి ఎయిడ్స్ ఉందా? లేదా? అనేది తేల్చుకోవాలని అనుకుంటున్నాం. అందుకే డాక్టర్ దగ్గరకి రమ్మని అడుగుతున్నా" అన్నాడు శశకాంత్.

మనోహర్ ముఖం మాడిపోయింది. అతని ఫ్రెండ్స్ అదిరిపడ్డారు.

"మా భయం మాది. పిల్లనిచ్చుకునే వాళ్లం గదా! అన్నట్లు ఈ మధ్య ముఖ్యమంత్రిగారు కూడా పెళ్లికి ముందు ఎయిడ్స్ టెస్ట్‌లు చేయించుకోవాలని రూలొకటి పెట్టాలనుకుంటున్నట్లు స్టేట్‌మెంట్ ఇచ్చారు. మీరు చూడలేదా?" అన్నాడు శశికాంత్.

"పెళ్లికొడుకును పట్టుకొని ఇలా డాక్టర్ దగ్గర టెస్ట్‌లు చేయించుకోవాలని, సర్టిఫికెట్ కావాలనీ అడిగిన వాళ్లని మిమ్మల్నే చూస్తున్నాను." అన్నాడు మనోహర్ ఫ్రెండ్ వ్యంగ్యధోరణిలో.

శశికాంత్ పకపకా నవ్వాడు.

"ముందు ఆ విషయం మీ ఫ్రెండ్‌ని అడగండి. మా చెల్లెలు కన్య అవునా? కాదా? అని డాక్టర్ సర్టిఫికెట్ అడిగాడో లేదో అడగండి." ఆవేశంగా అన్నాడు శశికాంత్.

మనోహర్ ముఖాన నెత్తురు చుక్కలేదు. అతని ఫ్రెండ్స్ నోళ్లు తెరిచారు.

"రోజులు మారుతున్నాయని గ్రహించండి. మగపెళ్లివాళ్లం కదా... అడ్డమైన కోరికలు కోరితే సహించే రోజులు పోయాయని గ్రహించండి. హైటెక్ సిటీలో పని చేస్తున్నారు కానీ బుద్ధులు మాత్రం లోటెక్‌లో ఉన్నాయి" అన్నాడు.

మనోహర్‌ని అతని మిత్రులు ఎగాదిగా చూశారు. ' ఇదేం పాడుబుద్ధి నీది' అన్నట్టు.

"గుర్తుంచుకో మిస్టర్ మనోహర్... ఈ పెళ్లి క్యాన్సిల్. ముందుముందు ఏ ఆడపిల్లనైనా అటువంటి కోరిక కోరితే చెప్పుతో కొడుతుంది. బై....

శశికాంత్ సీరియస్‌గా అని బయల్దేరాడు.

★

చిన్న కథ

# ఉద్యోగం

**బాలం వెంకట్రావు**

"ఉపాధ్యాయులు కావలెను" అన్న ప్రకటనని చూశాక సురేష్‌కి ఆశ కలిగింది. తనకున్న విద్యార్హతలే వారు కూడా అడగడంతో మరింత ఉత్సాహం వచ్చింది. ఈ ఉద్యోగం వస్తే కలలు నిజమవుతాయి. నెలకు పదివేలొస్తాయి. హాయిగా ఓ మోటార్‌బైక్ కొనుక్కోవచ్చు. రయ్‌మంటూ స్కూలుకు కూడా వెళ్ళిరావచ్చు. ఫ్రిజ్, కలర్ టీవి కొనుక్కోవచ్చు. తర్వాత నెల నెలా కొంత జమ చేసుకుంటే ఇల్లు కూడా కొనుక్కోవచ్చు!



"బాబూ! చార్మినార్‌కి పోవాలంటే ఏ బస్సెక్కాలి?" – అపరిచిత వ్యక్తి మాటల్తో సురేష్ ఈ లోకంలోకి వచ్చి, పక్కకి చూశాడు. పంచె కట్టుకొని నిలబడి వున్నాడు ఒక పల్లెటూరి ఆసామి.

సురేష్ అతన్ని ఎగాదిగా చూసి "నైన్ ఎమ్ నెంబర్ బస్సెక్కు" అన్నాడు. ఆ ఆసామి అర్థం కానట్టు ముఖంపెట్టాడు. చిరాగ్గా జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించాడు. గట్టిగా దమ్ములాగి గుప్పున పొగ వదిలాడు. ఇంతలో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు వచ్చి ఆగింది. ఒక్క ఉదుటున బస్సులోకి వచ్చిపడ్డాడు సురేష్. అటు ఇటు చూశాడు. వెనుక మగవారి సీట్లు కొన్ని, ముందు ఆడవారి సీట్లు రెండు ఖాళీగా వున్నాయి. వెంటనే ముందుకెళ్ళి ఓ సీట్లో కూర్చున్నాడు. అంతలో ఇంకో వ్యక్తి వచ్చి పక్కన కూర్చున్నాడు. కొంతసేపటికి నలుగురు ఆడవాళ్ళు ఎక్కారు. వారు కళ్ళు ఇంత చేసుకుని, చుట్టూ చూసి, నిట్టూర్చి, అలాగే నిలబడిపోయారు. బస్సు బయల్దేరింది. ఆడవాళ్ళు ఆశగా వీరి సీట్లవైపు చూశారు. కాని, వీళ్ళు అదేమీ గమనించలేదు.

"అవి లేడీస్ సీట్లు... మీరెలా కూర్చున్నారు? ఖాళీ చేయండి" పక్కనే నిలబడ్డ వ్యక్తి హుంకరించాడు, వారినుద్దేశించి. వారిద్దరూ పట్టనట్టుగా ఎటోచూస్తూ అలాగే కూర్చున్నారు.

"మిమ్మల్నే! లేవండి..." మళ్ళీ గద్దించాడు ఆ వ్యక్తి.

'నువ్వెవరు మాకు చెప్పడానికి' అన్నట్టుగా, ఎంతో అయిష్టంగా, అసహనంగా సీట్లలోంచి లేచారు ఇరువురూ. వెంటనే ఆడవాళ్ళు వచ్చి కూర్చున్నారు.

సురేష్‌కు అహం దెబ్బతిన్నట్టుంది. కాలర్ సవరించుకుంటూ వెనక్కి వచ్చి నిలబడ్డాడు. వాళ్ళని నమిలి మింగేసేలా కొరకొర చూడ్డం మొదలెట్టాడు. బస్సులో జనం ఎక్కువయ్యారు. ఇంతలో లక్డీకాపూల్ స్టాపు వచ్చింది. గమ్మున కిందకు దిగాడు. కొంచెం ఊపిరి పీల్చుకున్నాడు.

మళ్ళీ బస్సు బయల్దేరింది. సురేష్ ఫుట్‌బోర్డు మీదకి ఎక్కి ఓచేత్తో సర్టిఫికెట్ల ఫైలు పట్టుకొని. మరోచేత్తో ఇనుప కడ్డీని పట్టుకొని నిలబడ్డాడు. బస్సు ఆగినప్పుడల్లా జనం తోసుకుంటూ దిగారు, నెట్టుకుంటూనే ఎక్కారు. ఫుట్‌బోర్డు మీద ఇబ్బందికి విసుక్కుంటూనే వున్నారు. సురేష్ మాత్రం హాయిగా అక్కడే నిలబడ్డాడు.

అబిడ్స్ స్టాపులో బస్సు ఆగింది. సురేష్ బస్సు దిగి చిరునామా ప్రకారం ఒక స్కూలుకు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ యువతీయువకులు చాలామంది వున్నారు. అందరూ పుస్తకాలు చూసుకొంటూ, వ్రాత పరీక్ష గురించి చర్చించుకుంటున్నారు. ఆ స్కూలు ఎంతో ప్రతిష్ట కలిగినదనీ, జీతభత్యాలు ఉన్నతంగా వుంటాయనీ వారు అనుకోవడం విన్నాడు. సురేష్ అందరివంక తేరిపార చూశాడు. తనూ పుస్తకం తెరిచాడు.

పరీక్ష సమయం ఆసన్నమైంది. అందరూ హాల్లోకి వెళ్ళారు. తను చదివినవి మననం చేసుకుంటూ సురేష్ కూడా వెళ్ళాడు. వ్రాతపరీక్ష వినూత్నంగా జరిగింది. ఒకటి – మామూలు ప్రశ్నాపత్రం. మరొకటి – వ్యక్తిగత ప్రశ్నాపత్రం.

పరీక్ష ముగిసింది. అందరూ చెట్లకిందకు చేరారు. సురేష్ తను వ్రాసిన జవాబుల్ని బేరీజు వేసుకున్నాడు. అత్యధిక మార్కులు వస్తాయన్న ధీమా వచ్చింది. ఇంటర్వ్యూ మాత్రం మిగిలి వుంది.

మధ్యాహ్నం నిర్ణీత సమయానికే ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. ఒక్కొక్కరు గదిలోకి వెళ్ళివస్తున్నారు. సురేష్ వంతు వచ్చింది. జేబులోని దువ్వెన తీసి గబగబ తల దువ్వుకున్నాడు. చేతి రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. ప్యాంటు బెల్టు సరిచేసుకున్నాడు. ఫైలు పట్టుకుని హుందాగా గదిలోకి ప్రవేశించాడు.

కుర్చీలో కూర్చున్న బుర్రమీసాల పెద్దాయన్ని చూసి 'నమస్తే' అన్నట్టుగా చేత్తో విష్ చేశాడు, అలవాటుగా. ఆయన ప్రతి నమస్కారం చేశాడు, రెండు చేతుల్తో. తర్వాత కొన్ని ప్రశ్నలు వేశాడు. వాటికి సమాధానాలు చెప్పాడు. ఆ పెద్దాయన సురేష్ సర్టిఫికెట్లు, మెరిట్ పత్రాలు పరిశీలించాడు. విద్యార్హతలు, అదనపు అర్హతలు అన్నీ బాగున్నాయి. వ్రాతపరీక్షలో కూడా అత్యధిక మార్కులు వచ్చాయి.

పెద్దాయన ముఖ కవళికలు గమనించిన సురేష్ – ఉద్యోగం తనకే ఇవ్వబోతున్నందుకు ఆయన్ని మనసులోనే అభినందించాడు. సురేష్‌లో బయటకు తెలియని ఆనందం.

కాని, ఉన్నట్టుండి బుర్రమీసాల పెద్దాయన మాట్లాడటం మొదలెట్టాడు –

"డిగ్రీలు, మెరిట్ సర్టిఫికెట్లు వున్నంత మాత్రాన సరిపోదు. ఎంత ఉన్నత చదువులు చదివినా మనిషికి చదువుతోపాటు సభ్యత, సంస్కారం కూడా వుండాలి! అవి మీలో లేవు. మనిషి ప్రవర్తన గురించి తెల్సుకోవటానికి మేము ప్రత్యేకంగా రూపొందించిన ఇచ్చిన వ్యక్తిగత ప్రశ్నావళికి మీరు ఇచ్చిన సమాధానాలు మాకు తృప్తిని కలిగించలేదు. ఈ విషయంలో మిగతా వారే ఎంతో నయం!... ఉపాధ్యాయుడు చెడు లక్షణాలు కలిగివుంటే విద్యార్థులూ అవే నేర్చుకుంటారు... పిల్లలపై గురువుల ప్రభావం చాలా వుంటుంది. ఉదయం నేను ప్రయాణిస్తున్నప్పుడు బస్సులో మీ ప్రవర్తనని కూడా గమనించాను! ... అందుకే మీకు ఉద్యోగం ఇవ్వటం లేదు!"

సురేష్‌కి ఆ తర్వాత ఏమీ వినిపించలేదు.

తల విదుల్చుకుని వడివడిగా బయటికి నడిచాడు.

★